ఖైరతాబాద్‌లోని సప్తముఖ మహాశక్తి గణపతి దర్శనానికి ఆదివారం అశేషంగా తరలివచ్చిన భక్తజనం

ఖైరతాబాద్ మహాగణపతిని ఆదివారం దర్శించుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

మహాగణపతి.. విఘ్నాలు తొలగించు!

ప్రజలకు సుఖ సంతోషాలు కలగాలి: ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 15: 'వినాయకా.. రాష్ట్ర ప్రజల విఘ్నాలు తొలగించు.. తుఫాన్, వరదలతో, సీజనల్ వ్యాధులతో అవస్థలు పడుతున్న ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి అని రెండు చేతులు జోడించి మొక్కుకున్నా' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆయనకు ఘనస్వాగతం పలికింది. మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. ప్రపంచంలోనే ఖైరతాబాద్ మహాగణపతి అత్యంత ప్రాచుర్యం పొందిందన్నారు. 70 ఏండ్ల నుంచి నిరాటంకంగా నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కేసీఆర్ హయాంలో ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా నవరాత్రోత్సవాలు, శోభాయాత్రలు నిర్వహించామని, అదే తీరులో ప్రస్తుత ప్రభుత్వం ఉత్సవాలు జరిగేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకోవడం పూర్వజన్మ సృకుతంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నేతలు గజ్జెల నగేశ్, రావుల శ్రీధర్ రెడ్డి, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఖైరతాబాద్‌కు పోటెత్తిన భక్తజనం

హైదరాబాద్ నడిబొడ్డున ఖైరతాబాద్‌లో కొలువుదీరిన సప్తముఖ మహాశక్తి గణపతి దర్శనానికి చివరిరోజైన ఆదివారం భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు సుమారు ఐదు లక్షలకు పైగా భక్తులు వచ్చినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మహాగణపతి దర్శనం కోసం ఒక్కసారిగా లక్షలాది మంది తరలిరావడంతో వారిని అదుపు చేయలేని పరిస్థితి నెలకొన్నది. రాత్రి 12 గంటలకు వరకు ఏడు లక్షలకు పైగా భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నట్టు చెప్తున్నారు. నేడు దర్శనాన్ని పూర్తిగా నిలిపివేస్తున్నట్టు, భక్తులు ఎవరూ రావద్దని పోలీసులు ముందస్తుగా ప్రకటించారు. మహాగణపతిని దర్శించుకొని ఐమాక్స్, మింట్ కాంపౌండ్‌కు వెళ్లే దారుల్లో భక్తుల మధ్య తోపులాటలు చోటుచేసుకోగా పలువురు వృద్ధులు, మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు పోలీసుల తరమూ కాలేదు.బాధితులకు భక్తులే సపర్యలు చేశారు.

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

మంత్రి ఉత్తమ్ భద్రతా వాహనం ఢీ.. వ్యక్తి మృతి

న్యాయం చేయాలని గరిడేపల్లిలో బంధువుల రాస్తారోకో

గరిడేపల్లి, సెప్టెంబర్ 15: భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి భద్రత కోసం వెళ్తున్న ఫార్చునర్ వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రం తాసీల్దార్ కార్యాలయం సమీపంలో అబ్బిరెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. గరిడేపల్లి మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కీసర జీడయ్య (42) కూలిపని నిమిత్తం గరిడేపల్లి నుంచి అబ్బిరెడ్డిగూడెం వైపు బైకుపై వెళ్తున్నాడు. హుజూర్‌నగర్‌లో పర్యటిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎస్కార్ట్ కోసం హైదరాబాద్ నుంచి వెళ్తున్న ఫార్చునర్ (బుల్లెట్ ప్రూఫ్) వాహనం జీడయ్య బైకును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జీడయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జీడయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మిర్యాలగూడ–హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. దాదాపుగా రెండున్నర గంటలపాటు రాస్తారోకో చేయడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం స్థానిక నాయకులు, పోలీసులు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ చరమందరాజు, ఎస్సై నరేశ్ తెలిపారు.

జీడయ్య (ఫైల్)

రుణమాఫీ పూర్తి చేసినం

- మాఫీ చేయాల్సింది 42 లక్షల మందికి 31 వేల కోట్లు
- ఇప్పటికి చేసింది 23 లక్షల మందికి 18 వేల కోట్లు
- ఇంకా చేయాల్సింది 19 లక్షల మందికి 13 వేల కోట్లు
- రుణమాఫీ పూర్తి చేసినట్టు ఎలా అవుతుంది

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఒకవైపు రుణమాఫీ పూర్తి చేశామని చెప్తున్న ముఖ్యమంత్రి... మరోవైపు రూ.2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతులు ఆ పై మొత్తాన్ని చెల్లించిన వెంటనే మాఫీ చేస్తామని ప్రకటించారు. 'రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశాం. రూ.2 లక్షలకుపైగా రుణం కలిగిన రైతులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ రైతులు రూ.2 లక్షలకు పైబడి ఉన్న మొత్తాన్ని చెల్లించిన మరుక్షణమే మాఫీ చేస్తాం' అని ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సీఎం తాజా వ్యాఖ్యల ప్రకారం ఇంకా రుణమాఫీ మొత్తం పూర్తికాలేదని స్పష్టమవుతున్నది. రూ.2 లక్షల లోపు రుణాలు కలిగిన రైతుల్లో కూడా చాలా మందికి పలు సమస్యలతో మాఫీ కాలేదు. రూ.2 లక్షలకుపైగా రుణం కలిగిన రైతులెవరికీ రుణమాఫీ కాలేదు. అలాంటప్పుడు రుణమాఫీ పూర్తయినట్టు ఎలా అవుతుందని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

19 లక్షల మంది రైతులు... 13 వేల కోట్లు

ప్రభుత్వ లెక్కల ప్రకారం రుణమాఫీకి అర్హత కలిగిన రైతుల సంఖ్య 42 లక్షలు. వీరికి రుణమాఫీ చేసేందుకు రూ.31 వేల కోట్లు అవసరమని ప్రభుత్వం గతంలోనే వెల్లడించింది. ఇప్పటివరకు మూడు విడతల్లో 23 లక్షల మందికి రుణమాఫీ చేయగా, ఇందుకోసం రూ.18 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇంకా 19 లక్షల మంది రైతులకు రూ.13 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉన్నది. రూ.2 లక్షలలోపు రుణం ఉన్న సుమారు నాలుగు లక్షల మందికి మాఫీ కాలేదని తెలిసింది. రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలో తప్పులు ఉండటం తదితర కారణాలతో వీరికి రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులకు ఎప్పుడు మాఫీ అవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాన్ని బ్యాంకుల్లో చెల్లించిన వెంటనే మాఫీ చేస్తామని చెప్తున్న ప్రభుత్వం.. ఇందుకు ఎలాంటి గడువూ విధించలేదు. దీనికి తోడు రూ.2 లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని ఇప్పుడే చెల్లించొద్దని, తాము చెప్పినప్పుడే చెల్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటిస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో వీరికి రుణమాఫీ ఎప్పుడు అవుతుంది? అసలు అవుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధంగా ఆగస్టు 15 లోగా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామాను కోరడం విడ్డూరంగా ఉన్నదని ప్రతిపక్షం విమర్శిస్తున్నది. ఏ మొహం పెట్టుకొని హరీశ్‌రావును రాజీనామా కోరతారని ప్రతిపక్షం ప్రశ్నిస్తున్నది.

కౌశిక్ ఇంటిపై దాడి చేసింది మనోళ్లే!

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసింది కాంగ్రెస్ పార్టీ వాళ్లేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. 'మన ఇంటికి వస్తమని చెప్పిండ్రు.. కానీ, మనోళ్లే వాళ్ల ఇంటికి పోయిండ్రు..ఒళ్లు చింతపండు చేసిండ్రు' అని సీఎం వ్యాఖ్యానించారు. దీంతో కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఏ పార్టీవారో సీఎం స్పష్టం చేసినట్టయ్యింది. ఈ వ్యాఖ్యల ద్వారా గాంధీ తమవాడేనని తేల్చి చెప్పేశారు. ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ సభలో ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. 'కార్యకర్తలపై కేసులు పెట్టాలని దాడులకు ప్రయత్నిస్తున్నారు. ఒళ్లు చింతపండు అయ్యాక.. మా ఇంటికి వచ్చి తన్నిండ్రు అని చెప్తున్నరు. సంకనాక పిలవాలా.. రా రా చూసుకుందాం అని..' అంటూ అసలు విషయం చెప్పేశారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని ఫిరాయింపు ఎమ్మెల్యే గాంధీకి ఇవ్వడంపై బీఆర్ఎస్ మండిపడింది. దీంతో గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని, అందుకే పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చామని మంత్రులుశ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క చెప్తూ వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని చెప్పారు. ఆదివారం మాత్రం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ ఎమ్మెల్యేనని చెప్పకనే చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తాజా వ్యాఖ్యలతో అబద్ధాల కుండ బద్దలైపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై దాడులను ప్రోత్సహించేలా ఉన్నాయనే విమర్శలొస్తున్నాయి. సీఎం రేవంత్ భాషపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్లాన్ ప్రకారమే కౌశిక్‌రెడ్డిపై దాడికి ఉసిగొల్పారనే ప్రచారం సాగుతున్నది.

విమోచన దినోత్సవమే జరపాలి

- 'ప్రజాపాలన'లో భాగస్వామిని కాలేను
- సీఎంకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా కాకుండా, తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాపాలన దినోత్సవం పేరిట నిర్వహించే కార్యక్రమానికి తాను రాలేనని స్పష్టంచేశారు. సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవానికి కేంద్ర మంత్రుల ను ఆహ్వానించిన నేపథ్యంలో కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. ముఖ్యమంత్రికి ఆదివారం లేఖ రాశారు. సెప్టెంబర్ 17ను పవిత్రమైన, స్ఫూర్తిదాయకమైన రోజు గా కిషన్‌రెడ్డి అభివర్ణించారు. వేలాది మంది త్యాగాల ఫలితమైన విమోచన దినోత్సవం పేరును మార్చి చరిత్రలో ఏమీ జరగలేదన్నట్టుగా వక్రీకరించడం తగదని పేర్కొన్నారు. ఘనమైన తెలంగాణ చరిత్రను ప్రజల స్మృతిపథం నుంచి తుడిచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో తాను భాగస్వామిని కాలేనని తెలిపారు.

ఓవైసీకి భయపడే.. : మహేశ్వర్‌రెడ్డి

ఎంఐఎం ఒవైసీలకు భయపడే రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా నిర్వహించడంలేదని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఇతర పేర్లతో నిర్వహించడం తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను విస్మరించడమేనని ఆదివారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

ఇంట్లోకి చొరబడి పుస్తెలతాడు చోరీ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 15: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడిన ఓ దుండగుడు కూరగాయలు కోస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. తంగళ్లపల్లిలోని మార్కండేయ ఆలయం పక్కన ఒంటరిగా నివాసం ఉండే సబ్బని రుక్కుంబాయి (70) తన ఇంట్లో దర్వాజ వద్ద కూర్చుని వంట కోసం కూరగాయలు కోస్తున్నది. ఓ ఆగంతకుడు ఇంట్లోకి చొరబడి రుక్కుంబాయి మెడలో నుంచి పుస్తెలతాడును లాక్కెళ్లి వీధి సమీపంలో పార్కింగ్ చేసిన బైక్‌పై పరారయ్యాడు. వృద్ధురాలు బయటకు వచ్చి కేకలు వేయగా.. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం, పోలీసు జాగిలంతో గాలించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై సుధాకర్ మండల కేంద్రంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

16 మంది ఎంపీలు పేదల విరోధులా?

- 17 మందిలో అసదుద్దీన్ ఒక్కడే పేదల పక్షపాతి అన్న సీఎం
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీల గుర్రు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిపై రాష్ట్ర ఎంపీలు గుర్రుమంటున్నారు. రాష్ట్రంలో 17 మంది ఎంపీలు ఉంటే అసదుద్దీన్ ఒవైసీ మాత్రమే పేదల పక్షాన గొంతెత్తుతారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'ప్రొఫెట్ ఆఫ్ ద వరల్డ్' పుస్తకావిష్కరణ సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఉమ్మడి ఏపీలో పలువురు ఎంపీలు పేదల పక్షాన పార్లమెంట్‌లో గళమెత్తేవారు.ఇప్పుడు ఆ సంఖ్య చాలా తగ్గింది. ప్రస్తుతం వ్యాపారవేత్తలు, కార్పొరేట్లు రాజకీయాల్లోకి వస్తున్నారు. వాళ్లు వ్యాపారాల్లో బాగానే రాణిస్తున్నారు. కానీ పేదల పక్షాన గొంతెత్తేవారు తక్కువయ్యారు. ప్రస్తుతం ఉన్న 17 మందిలో నాకు పేదల పక్షాన గొంతెత్తే ఒకే వ్యక్తిగా అసదుద్దీన్ ఒవైసీ మాత్రమే కనిపిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. దీంతో రాష్ట్రంలోని మిగతా ఎంపీలు సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. అసదుద్దీన్ మినహా మిగతా 16 మంది ఎంపీల్లో 8 మంది కాంగ్రెస్‌కు చెందినవారు కాగా, మిగతా 8 మంది బీజేపీకి చెందినవారు. ఇందులో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నారు. అందరినీ పేదలకు విరోధులుగా ప్రకటించటంపై వారు మండిపడుతున్నారు.

సొంత పార్టీ ఎంపీలకే అవమానమా?

ఎంపీ అసదుద్దీన్‌ను పొగిడే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత పార్టీ ఎంపీలనూ అవమానించేలా మాట్లాడారని కాంగ్రెస్ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇది కాంగ్రెస్ నుంచి గెలిచిన 8 మంది ఎంపీలను అవమానించడమే అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎంపీల్లో సీఎం ఏరికోరి టికెట్ ఇచ్చుకొని, గెలిపించుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య వంటి వారు కూడా ఉన్నారని గుర్తుచేస్తున్నారు.సీఎంగా ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే పార్టీకి ప్రజల్లో ఏం విలువ ఉంటుందని మండిపడుతున్నారు. ప్రభుత్వం ఉన్నది ప్రజాసేవకే అనేలా ఉండాలే తప్ప.. తమవాళ్లు ఎవరూ పేదల పక్షాన మాట్లాడరు అన్నట్టుగా వ్యాఖ్యానించటం ఏమిటని మండిపడుతున్నారు. ప్రతిపక్షం అంటే పేదల తరపున పోరాడుతుందని, కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పేదల తరపున పోరాడదని సంకేతాలు ఇస్తున్నారా? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు సైతం మండిపడుతున్నారు. 'మేము పొద్దునలేస్తే ప్రజల మధ్యనే ఉంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కొట్లాడేది కార్పొరేట్ల కోసమా? రైతులందరూ వ్యాపారవేత్తలా? హైడ్రా పేరు తో మీరు కూల్చిన గుడిసెలు కోటీశ్వరులవా? వాళ్లందరి తరపున మేం పోరాడేది కనిపించడం లేదా?' అని బీజేపీకి చెందిన ఓ ఎంపీ మండిపడ్డారు. ఒవైసీని ప్రసన్నం చేసుకునే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాజకీయ విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సొంత పార్టీ ఎంపీలను కూడా అవమానిస్తూ ఎంఐఎంను ప్రసన్నం చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు.

సీపీఎస్ రద్దుకు 26న దేశవ్యాప్త ప్రదర్శనలు

ఎన్ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలని, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఈ నెల 26న దేశంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్, తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ వెల్లడించారు. ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన ఎన్ఎంవోపీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. యూపీఎస్, ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సీపీఎస్ రద్దుపై జాతీయస్థాయి ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు డిసెంబర్ 15న ఢిల్లీలో ఎన్ఎంవోపీఎస్ జాతీయ కన్వెన్షన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. మహారాష్ట్ర, హరియాణా, జమ్మూకశ్మీర్, ఝార్ఖండ్, ఢిల్లీ రాష్ట్రాల ఎన్నికల్లో 'ఓట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం' నినాదంతో ముందుకెళ్తామని స్పష్టంచేశారు. సమావేశంలో తెలంగాణ నుంచి కల్వల్ శ్రీకాంత్, నరేశ్‌గౌడ్ సహా 22 రాష్ట్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దాయన మాటా పెడచెవిన!

- ఎవరికీ చెప్పకుండానే గుత్తా అమిత్ బాధ్యతలు
- రేవంత్‌రెడ్డి వర్గానికే పదవులు
- నల్లగొండ కాంగ్రెస్‌లో ముసలం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో పదవుల చిచ్చు ఆరేలా కనిపించడంలేదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డిలకు నామినేటెడ్ పోస్టులపై పార్టీ సీనియర్లు గుర్రుగా ఉన్నారు. పార్టీ అధిష్ఠానం వారిద్దరూ బాధ్యతలు తీసుకోవద్దని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చింది. అయినా ఎవరికీ చెప్పకుండా.. డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. గత వారమే ఆయన నేరుగా కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడు సర్వత్రా ఇదే చర్చనీయాంశంగా మారింది. గుత్తా సుఖేందర్‌రెడ్డి రాజకీయ వారసుడిగా ఆరంగేట్రం చేసిన అమిత్‌రెడ్డి తొలిసారి ప్రభుత్వ పదవిని సాధించుకున్నారు. ఇలాంటి సందర్భాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలనైనా పిలిచి, వారి సమక్షంలో బాధ్యతలు స్వీకరించాలి. విచిత్రంగా కనీస సమాచారం లేకుండానే హడావుడిగా ఒక్కడే వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం ఇది హాట్‌టాపిక్‌గా మారింది. గుత్తా అమిత్ రెడ్డికి పదవి ఇవ్వడం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కాంగ్రెస్‌లో తుఫాను సృష్టించిందని చెప్పవచ్చు. జిల్లాలో పదుల సంఖ్యలో నేతలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పని చేస్తే.. వారెవ్వరికీ పదవులు ఇవ్వకుండా బీఆర్ఎస్ నుంచి అప్పటికప్పుడు వచ్చి చేరిన అమిత్‌రెడ్డికి పదవి ఇవ్వడం పార్టీ సీనియర్లను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.అమిత్‌కు పదవి రావడమే ఆల స్యం.. జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నేతలు, మంత్రులు పార్టీ అధిష్ఠానం వద్ద తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

నొచ్చుకున్న పెద్దాయన

నల్లగొండ జిల్లాలోని సీనియర్ కాంగ్రెస్ నేత వద్దకు జిల్లా నేతలు వెళ్లి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. దీంతో ఆయన గుత్తా అమిత్ రెడ్డికి పదవి తీసుకోవద్దని వారించినట్టు తెలిసింది. ఆయనతోపాటు పోచారం శ్రీనివాస్ రెడ్డిని కూడా పదవి తీసుకోవద్దని, స్వచ్ఛందంగా వదిలివేస్తున్నట్టు చెప్పాలని సూచించినట్టు తెలిసింది. గుత్తా అమిత్‌రెడ్డి మాత్రం 'పెద్దాయన' మాటను పట్టించుకోకుండానే వెళ్లి పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అయిందనిపించారు. దీంతో నల్లగొండ పెద్దాయన నొచ్చుకున్నట్టు సమాచారం. ఆయన జిల్లా నేతలతో కూడా చర్చించి ఇది పద్ధతి కాదని, పార్టీ బద్నాం అవుతోందని అన్నట్టు తెలిసింది.జిల్లాలో రేవంత్‌రెడ్డి వర్గంగా ఉంటున్నవారికి మాత్రమే పదవులు వస్తున్నాయని, ఇక్కడ పార్టీ కోసం పనిచేస్తున్న వారికి పదవులు రావడంలేదని పలువురు నల్లగొండ నేతలు తీవ్ర అసంతృప్తి చేస్తున్నారు. ఇప్పటికే పటేల్ రమేశ్ రెడ్డికి పదవి ఇవ్వడం, బంద్రు శోభారాణికి ఇవ్వడం, తాజాగా అమిత్‌రెడ్డికి పదవి ఇవ్వడం అసంతృప్తికి గురిచేస్తున్నది. టీడీపీ మూలాలున్న వీరు రేవంత్‌రెడ్డి వర్గంగా ముద్రపడ్డారు. వీళ్లకే పదవులు ఇస్తూ పోతే మరి అసలు కాంగ్రెస్ వాళ్ల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉదయిస్తున్నది.

16 రోజులుగా పవర్ కట్

మొదటిపేజీ తరువాయి...

చేసినా పట్టించుకోవడం లేదని, పంటలకు నీళ్లు లేక ఎండిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. విద్యుత్తు అధికారులకు ఫోన్లు చేసినా ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు వచ్చినప్పటి నుంచి విద్యుత్తు స్తంభాలు, లైన్లు దెబ్బతిన్నాయని, వాటిని పునరుద్ధరించకుండా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతులకు 24 గంటల కరెంట్ వచ్చిందని, కాంగ్రెస్ పాలనలో ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యానికి పంటలు ఎండిపోతుండటంతో సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులకు విద్యుత్తును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

వర్షాలు వచ్చినప్పటి నుంచి కరెంట్ రావడం లేదు

వర్షాలు వచ్చినప్పటి నుంచి త్రీఫేజ్ కరెంట్ రావడం లేదు. నాకు 7 ఎకరాల వరి పొలం ఉంది. కరెంట్ లేక పొలం ఎండిపోతున్నది. కరెంట్ కోసం అధికారులకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. మేమే ఎక్కడైనా విద్యుత్తు లైన్లు తెగిపడ్డాయో చూస్తున్నాము. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు.

-గట్టికొప్పుల మోహన్‌రెడ్డి, రైతు, మామిళ్లగూడెం